
సాక్షి
వికారాబాద్
మంగళవారం । 30 । మే । 2023



రియల్టర్లపై చర్యలేవి?
ప్రభుత్వ రోడ్డును తొలగించి వెంచర్ వేసిన రియల్టర్లపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. 8లో▸



అభివృద్ధికి నోచుకోని రోడ్లు
గ్రామాల మధ్య దూరభారం తగ్గించడానికి ఏర్పాటు చేసిన లింకు రోడ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. 9లో▸



తీరని కష్టాలు
ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తిప్పలు తప్పడం లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు మండిపడ్డారు. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: లోన్ ఆఫీసర్, బ్రాంచ్ మేనేజర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ ప్రైవేట్ కంపెనీలో వంద ఉద్యోగాల భర్తీ కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసులో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన వారు ఉదయం 10.30 గంటలకు మేళాకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన వారికి అర్హతల ఆధారంగా నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వేతనం చెల్లిస్తారని తెలిపారు. వివరాలకు 9676047444 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు

ధారూరు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. జీలుగ 30 కిలోల బస్తా రూ.843, జనుము 40 కిలోల బస్తా రూ.1,225 చెల్లించి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. అసరమున్న రైతులు వ్యవసాయ అధికారి నుంచి అనుమతి పత్రం తీసుకుని రావాలన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు
ధారూరు పీఏసీఎస్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని చైర్మన్ తెలిపారు. యాసంగిలో మొక్కజొన్నను సాగుచేసిన రైతులు పాసుబుక్కు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, ఏఈఓ పర్మిట్ తీసుకుని వస్తే క్వింటాలుకు రూ.1,962 మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు జూన్ 15వ తేదీ లోపు వాయిదాలు చెల్లిస్తే అపరాధ రుసుం ఉండదని తెలిపారు.

వీరన్నస్వామి అవతారంలో శివయ్య దర్శనం



వీరన్నస్వామి అలంకరణలో పరమ శివుడు

తాండూరు టౌన్: భావిగి భద్రేశ్వరాలయంలోని శివాలయంలో సోమవారం మహాశివుడు వీరన్నస్వామి అవతారంలో దర్శనమిచ్చాడు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

2న ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

బంట్వారం: తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ తెలిపారు. సోమవారం కోట్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాండూరు నియోజకవర్గంలోని కోట్‌పల్లి, బుగ్గాపూర్, లింగంపల్లి, అన్నాసాగర్, ఓగులాపూర్, ఇందోల్ గ్రామాల యువత పాల్గొనాలన్నారు. ఆసక్తి గల వారు జూన్ 1వ తేదీన 7661899899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. జూన్ 2న పోటీలు ఉంటాయని, 16 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అంజయ్య, కోట్‌పల్లి మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వర్, నాయకులు నర్సింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రలో ఇబ్బందులు రానీయం

మంత్రి కొప్పుల ఈశ్వర్

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. యాత్రకు సంబంధించిన అన్ని ప్రక్రియలను హజ్‌హౌస్‌లోనే చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మేరకు ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సోమవారం నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో హజ్ శిబిరం ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా సిబ్బందిని నియమించాలని, ఈ మేరకు విధులను ఖరారు చేయాలని, క్యాంపు నిర్వహణపై వారికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యాత్రకు సంబంధించి లగేజ్, బోర్డింగ్, ఇమిగ్రేషన్, కస్టమ్స్ తదితర అన్ని ప్రక్రియల కౌంటర్లను హజ్‌హౌస్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం, సలహాదారు ఏకే ఖాన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీవుల్లా ఖాన్, రాష్ట్ర హజ్ కమిటీ ఈఓ షఫివుల్లా పాల్గొన్నారు.

గతితప్పిన పారిశుద్ధ్యం

- కంపు కొడుతున్న మున్సిపాలిటీలు
- పట్టించుకోని అధికారులు
- అవస్థల్లో ప్రజలు



వికారాబాద్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారిలో రోడ్డపై పారుతున్న మురుగు

వికారాబాద్: పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకు అధికమవుతోంది. వార్డుల్లో సేకరించిన చెత్తను ఇష్టారాజ్యంగా శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు. ఆయా వార్డుల్లోని చెత్త కుండీలను తొలగించడం, చెత్త బండ్లు సక్రమంగా రాకపోవడంతో స్థానికులు కాలనీ కూడళ్లలో చెత్త పారబోస్తున్నారు. ఇక మున్సిపాలిటీల్లో విలీనమైన అనుబంధ గ్రామాల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. క్రమంతప్పకుండా పన్నులు వసూలు చేస్తున్న అధికారులు వసతుల కల్పనలో విఫలమవుతాన్నారని ప్రజలు మండిపడుతున్నారు. రోడ్ల పక్కన డంప్ చేసిన చెత్తాచెదారం కుళ్లిపోవడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. దీనికి తోడు భరించలేని దుర్గంధం పెరిగిపోయి పరిసర ప్రాంత ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఇక రోజు ఉదయం లేవగానే తడిపొడి చెత్త వేర్వేరుగా వేయాలని మున్సిపాలిటీ వాహనాలతో ఊదరగొడుతున్న యంత్రాంగం ఆ దిశగా చర్యలు కనిపించటం లేదు. తడిపొడి చెత్తనంతా ఒకే చోట సేకరించి, శివారు ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు.

సమస్య తీరడంలేదు
పారిశుద్ధ్య పరిరక్షణ కోసం ఒక్కో మున్సిపాలిటీలో రూ.కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నా.. సమస్యలు మాత్రం అలాగే దర్శనమిస్తున్నాయి. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నాలుగు మున్సిపాలిటీలు ఉండగా చెత్త సేకరణ విధానంలో అన్నింటిలో అస్తవ్యస్తంగానే మారింది. అధికారులు చెబుతున్న దానికి వాస్తవ పరిస్థితులకు పొంతన కనిపించటంలేదు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

- తాండూరు మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా 80 వేల జనాభా ఉంది. ప్రతి రోజు 44 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. ఇక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియకు ఆరంభంలోనే స్వస్తి పలికారు.
- పరిగి మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా.. మున్సిపాలిటీలో 30 వేల మంది నివసిస్తున్నారు. నిత్యం 8నుంచి 10 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. తడిపొడి చెత్తను వేరు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా ఎక్కడా కనిపించడం లేదు.
- కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా 22వేల జనాభా ఉంది. రోజుకు 6 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతుంది. తడిపొడి చెత్త వేరుచేసే ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదు. కొంతకాలంగా కంపోస్ట్ ఎరువు తయారు చేస్తామని చెబుతున్నప్పటికీ ఆదిశగా చర్యలేవీ చేపట్టడం లేదు.
- వికారాబాద్ మున్సిపల్ పరిధిలో 34 వార్డులు ఉండగా లక్షాపది వేల జనాభా ఉంది. నిత్యం 32 మెట్రిక్ టన్నులు చెత్త సేకరిస్తున్నారు. చెత్తను వేరు చేసే ప్రక్రియ చేపట్టడం లేదు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ఏ కాలనీలో చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి.



వికారాబాద్‌లోని ఓ కాలనీలో రోడ్డు పక్కన చెత్త పారబోత

వేడుకలు అదిరిపోవాలి

- రాష్ట్రావతరణ సంబరాలకు అన్ని ఏర్పాట్లు చేయండి
- తొమ్మిదేళ్లుగా జిల్లాలో సాధించిన ప్రగతిని వివరించండి
- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకలను వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలను ఆమెకు వివరించారు. వీసీ అనంతరం అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ నిర్వహించాలని తెలిపారు. జూన్ 2న ఉదయం 9గంటలకు పతాకావిష్కరణ చేయాలన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో ఆయా శాఖల ఆధ్వర్యంలో సాధించిన ప్రగతిని వివరించేలా ప్రసంగంతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. దశాబ్ది వేడుకలు పూర్తయ్యే వరకూ ఎవరికీ సెలవులు మంజూరు చేసేది లేదని స్పష్టంచేశారు.

208 ఫిర్యాదులు
ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజల నుంచి 208 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిని సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ఓటరుగా నమోదు చేయాలి
పద్దెనిమిది సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మే 25 నుంచి జూన్ 23 వరకు బీఎల్‌ఓల ద్వారా ఇంటింటి సర్వే చేయిస్తామన్నారు. జూన్ 24 నుంచి జూలై 24 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, వ్యత్యాసాల తొలగింపు, ఫొటో ఇమేజ్‌లను మెరుగుపర్చడం, పోలింగ్ కేంద్రాల బౌండరీల్లో మార్పులు, చేర్పులు, నియంత్రణ పట్టికల్లో సవరణ వంటివి పూర్తి చేయాలన్నారు. చనిపోయిన వారు, రెండు ఓట్లు ఉన్నవారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని గుర్తించి లిస్ట్ నుంచి తొలగించాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డుల్లో ఏవైనా తప్పులు ఉంటే సరి చేసేందుకు ప్రజాప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసి సహకరించాలని తెలిపారు. జూన్ 24 నుంచి జూలై 25 వరకు ఓటర్లు, పోలింగ్ కేంద్రాల మార్పులు ఉంటే గుర్తించి తెలియజేయాలన్నారు. ఆగస్టు 2న ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురిస్తారని స్పష్టంచేశారు. ఆగస్టు 2 నుంచి 31వరకు డ్రాఫ్ట్ రోల్‌పై వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి, చర్యలు తీసుకుంటామని వివరించారు. సెప్టెంబర్ 22లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు.



జీవన్గీ సమీపంలో అక్రమంగా కొనసాగుతున్న నాపరాతి తవ్వకాలు

నాపరాతి గనుల్లో యథేచ్ఛగా తవ్వకాలు

కన్నెత్తి చూడని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

బషీరాబాద్: మండలంలో గనుల దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. అనుమతులు లేని మైనింగ్ భూముల్లో దర్జాగా అక్రమార్కులు నాపరాతి నిక్షేపాలను దోచేస్తున్నారు. జీవన్గీ, ఎక్మాయి, కొర్విచెడ్, నవల్గా గ్రామాల పరిధిలోని నాపరాతి గనుల్లో వ్యాపారులు హిటాచీలతో భారీగా తవ్వకాలు జరుపుతున్నారు. తవ్వకాల ద్వారా వెలికితీసిన నాపరాతిని పదుల సంఖ్యలో లారీల్లో రాయల్టీ లేకుండా దర్జాగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జీవన్గీ గ్రామంలోని సర్వేనంబర్ 238లో గతంలో ప్రభుత్వం వ్యవసాయం కోసం సుమారు 30ఎకరాలు అసైన్‌మెంట్ భూమిని పేదలకు ఇచ్చింది. అయితే భూముల్లో ఆపార నాపరాతి నక్షేపాలు ఉన్నట్లు గుర్తించిన వ్యాపారులు రైతులను మభ్యపెట్టి ఆ భూముల్లో నాపరాతి తవ్వకాలు చేస్తూ వస్తున్నారు. మూడు దశాబ్దాలుగా ఇలా అక్రమంగా మైనింగ్ తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. అప్పట్లో ప్రభుత్వం కొదరికి మైనింగ్ కోసం అనుమతులు ఇచ్చింది. దీన్ని ఆసరా చేసుకొని యేళ్ల తరబడి గనులు తవ్వుకున్నారు. సుమారు 18 మంది వ్యాపారులు ఎలాంటి లీజులు, రాయల్టీలు లేకుండా అక్రమంగా గనులను తోడేస్తున్నారు. ఇదే మాదిరి ఎక్మాయి, కొర్విచెడ్, నవల్గాలోనూ దోపిడీ జరుగుతుంది. ఇంతా జరుగుతున్న రెవెన్యూ, మైన్స్ అధికారులు అక్కడ కన్నెత్తి కూడా చూడడంలేదు. పత్రికల్లో కథనాలు వచ్చిన రోజు నామమాత్రంగా దాడులు చేసి కొన్ని రోజులకు యథావిధిగా తవ్వకాలు జరుగుతున్నాయి.

అధికారులపై రాజకీయ నేతల ఒత్తిళ్లు?
ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్ జరుపుతున్న వ్యాపారులపై అధికారులు చర్యలకు వెనకడుగు వేయడంపై రాజకీయ ఒత్తిళ్లు కూడా ఉన్నాయి. పదుల సంఖ్యల వ్యాపారులు తవ్వకాలు చేస్తుంటే వంద సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. వారి ఓట్ల కోసం రాజకీయ నాయకులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారే ఆరోపణలున్నాయి. అధికారుల దాడులను పరోక్షంగా వీరే అడ్డుకుంటున్నారని జనం మండిపడుతున్నారు.



గృహ ప్రవేశానికి రండి

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సోమవారం కుటుంబ సమేతంగా చెన్నై వెళ్లి సూపర్ స్టార్ రజనీకాంత్‌ను కలిశారు. తాండూరులో తాను నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ వేడుకకు (జూన్ 7న) హాజరు కావాలని కోరారు.
– తాండూరు

నేడు షాద్‌నగర్‌కు ముగ్గురు మంత్రులు

రూ.161.73కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

షాద్‌నగర్: నియోజకవర్గం పరిధిలో రూ.161.73 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఆయా కార్యక్రమాలకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, ఎక్సైజ్, యువజన క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. నందిగామలో డీఎల్‌ఎఫ్ వద్ద రూ.2కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభోత్సవం, రూ.15కోట్లతో నిర్మించనున్న షాద్‌నగర్ –కేశంపేట రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.45కోట్లతో పాత జాతీయ రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన, షాద్‌నగర్‌లో రూ.1.88 కోట్లతో నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవం, రూ.95కోట్లతో నిర్మిస్తున్న చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, చటాన్‌పల్లిలో రూ.1.40కోట్లతో సబ్‌స్టేషన్ పనుల ప్రారంభం, షాద్‌నగర్‌లో నిర్మించిన నైట్ షెల్టర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

జూన్ 1 నుంచి అడ్మిషన్లు

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జూన్ 1 నుంచి మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఉంటాయని వికారాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 1న ఫిజికల్ సైన్స్, బీఎస్సీ, ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్ తదితర గ్రూప్‌లు, బీకామ్ (బిజినెస్, ఎనలటిక్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ హెచ్‌ఈపీ) కోర్సుల్లో అడ్మిషన్ల కోసం, జూన్ 2న లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ కోర్సుల్లో అడ్మిషన్లకు విద్యార్థులు 9.30 గంటల నుంచి కళాశాలలో రిపోర్టు చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఈ కళాశాల మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలోని ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతోందని, విద్యార్థులు ఈ అడ్రస్‌కు రావాలని కోరారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమోలు, హాల్‌టికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం, 5–10 తరగతులు చదివిన బోనఫైడ్, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకు రావాలని ఆయన సూచించారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు షురూ
షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (నాగర్‌కర్నూల్)లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీయూజీ సెట్–2023లో అర్హత సాధించిన విద్యార్థులు జూన్ 2న సంబంధిత వివరాలతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. బీఎస్సీ (ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ), బీకాం కంప్యూటర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- పలు గ్రామాల్లో 'పల్లెబాట'
- సమస్యల పరిష్కారానికి హామీ



బొంరెడ్డిపల్లిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన బొంరెడ్డిపల్లి, బండవెల్కిచర్ల, రాంనగర్, సాల్వీడు, ఘనపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటివరకు బొంరెడ్డిపల్లిలో రూ.93.62 లక్షలతో, బండవెల్కిచర్లలో రూ.1.92 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరో రెండు నెలల్లో ఆయా గ్రామాలకు రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. బండవెల్కిచర్లకు చెందిన లబ్ధిదారులకు మొదటి విడత డబుల్ బెడ్రూంలు పంపిణీ చేస్తామని తెలిపారు. అల్మాస్‌ఖాన్‌పేట్‌లో భూముల సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్ నాయక్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, చౌడాపూర్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నర్సింలు, సర్పంచులు అంజనేయులు, శిరీషాలక్ష్మారెడ్డి, రాజు, బాలయ్య, విజయలక్ష్మి, ఘనపూర్ ఎంపీటీసీ వెంకటమ్మ, నాయకులు రాజప్ప, దామోదర్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్‌లో సురభి ప్రసన్న విన్యాసం

క్రీడా సంబరం

ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు

హుడాకాంప్లెక్స్: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్–2023 పోటీలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సోమవారం రెండో రోజు అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్ పోటీలను డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 జిల్లాల నుంచి ఎంపికైన క్రీడాకారులు పోటీ పడుతున్నారని తెలిపారు. ఈ నెల 31న ఫైనల్స్ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్, జిమ్నాస్టిక్స్ కార్యదర్శి బాలరాజు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, శిక్షకులు పాల్గొన్నారు.

రెండో రోజు విజేతలు వీరే..
వాలీబాల్ (పురుషుల విభాగం): సిరిసిల్ల–నిర్మల్ జిల్లాలు పోటీపడగా సిరిసిల్ల విజేతగా నిలిచింది. కామారెడ్డి–నల్లగొండ మధ్య పోటీలో విజేతగా కామారెడ్డి జిల్లా, జనగాం–మహబూబాబాద్ మధ్య జనగాం విజేతగా, కొత్తగూడెం–సంగారెడ్డి జిల్లా మధ్య కొత్తగూడెం విజేతగా నిలిచింది. ములుగు–మేడ్చల్ మధ్య ములుగు విజేతగా, సూర్యాపేట–గద్వాల మధ్య సూర్యాపేట విజేతగా, జగిత్యాల–మంచిర్యాల మధ్య జగిత్యాల జట్టు విజేతగా, ఆదిలాబాద్–పెద్దపల్లి మధ్య ఆదిలాబాద్ జిల్లా విజేతగా నిలిచాయి.



వాల్ట్ ఈవెంట్‌లో నిశిక అగర్వాల్

వాలీబాల్ (మహిళల విభాగం): రంగారెడ్డి–నారాయణపేట జిల్లాల మధ్య జరిగిన పోటీలో రంగారెడ్డి జట్టు గెలువగా, సంగారెడ్డి–పెద్దపల్లి జట్ల మధ్య సంగారెడ్డి విజేతగా, వికారాబాద్–సిద్దిపేట మధ్య వికారాబాద్ విజేతగా, మెదక్–మంచిర్యాల మధ్య మెదక్ విజేతగా, కొత్తగూడెం–వనపర్తి మధ్య కొత్తగూడెం విజేతగా, నిజామాబాద్–వికారాబాద్ మధ్య నిజామాబాద్ జట్టు విజేతగా, సిరిసిల్ల–నారాయణపేట మధ్య సిరిసిల్ల జట్టు విజయం సాధించాయి.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు కలప దగ్ధం

దోమ: ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుని పక్కనే ఉన్న కట్టెకోత మిషన్‌లో కలప దగ్ధమైన సంఘటన దాదాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కమ్మరి యాదగిరి అనే వ్యక్తికి చెందిన కట్టెకోత మిషన్‌లో కలప నిల్వ ఉంది. అయితే పక్కనే ఉన్న ఓ రైతు పొలంలో ఉన్న గడ్డి వాముకి ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు పక్కనే ఉన్న కట్టెలకు అంటుకున్నాయి. దీంతో రూ.2లక్షల విలువ చేసే కలప కాలిబూడిదైనట్లు బాధితుడు తెలిపారు. అప్రమత్తమైన గ్రామస్తులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో మంటలను ఆర్పారు.

చికిత్స పొందుతున్న కూలీ మృతి


విజయ(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: కూలి పనులకు వెళ్తున్న వాహనం ఫల్టీ కొట్టి 21మంది కూలీలు గాయపడిన విషయం విదితమే. ఈ నెల 23న ఆదిబట్ల సమీపంలోని బీరప్ప ఆలయం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో విజయ తలకు బలమైన గాయమవ్వడంతో ఆమెకు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచింది. మృతురాలికి భర్త, కుమారుడున్నాడు. బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి


ఆవు కళేబరం వద్ద రోదిస్తున్న బాధితురాలు

కేశంపేట: పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డా యి. ఈ ఘటన మండల పరిధి లోని కొండారెడ్డిపల్లిలో సోమ వారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వట్టెల శంకరయ్య పాడి పరిశ్రమపై ఆధారపడి కు టుంబాన్ని పోషించుకుంటు న్నాడు. సాయంత్రం పిడుగు పడడంతో రెండు ఆవులు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ .1.60లక్షలు ఉంటుందన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడిని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మతిస్థిమితం లేని మహిళ అనుమానాస్పద మృతి


మౌనిక మృతదేహం

మీర్‌పేట: ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా ధర్మారావుపేటకు చెందిన కాసమోని మౌనిక (24)కు శ్రవణ్‌కుమార్‌తో మూడు నెలల క్రితం వివాహమైంది. మౌనిక మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో కొన్నిరోజుల నుంచి మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లో నివాసముండే సోదరి వద్దకు వచ్చి ఉంటోంది. కాగా, సోమవారం ఉదయం మౌనిక అపార్ట్‌మెంట్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. మౌనిక మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో కొంత కాలం ఉంచి చికిత్స అందించామని, జీవితంపై విరక్తి చెంది గతంలో పలుమార్లు ఆత్మహత్యకు కూడా యత్నించిందని కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. అపార్ట్‌మె ంట్ 5వ అంతస్తు నుంచి మౌనిక దూకి ఆత్మహ త్య చేసుకొని ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని సీఐ పేర్కొన్నారు.

రియల్టర్లపై చర్యలేవీ?

నివేదిక పంపినా ఫలితం శూన్యం


తవ్వి చదును చేసిన రోడ్డు దుస్థితి

పరిగి: ప్రభుత్వ రోడ్డును తొలగించి వెంచర్ వేసిన రియల్టర్లపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో స్థానికంగా విమర్శలు వెల్లువెత్తున్నాయి. వ్యాపారులకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని, అధికారులు రియల్టర్లతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు అధికారులకు విన్నవించినా.. చర్యలు తీసుకోకపోవడం ఎంత వరకు సమంజసమని పలువురు నాయకులు ప్రశ్నిస్తున్నారు.

వెంచర్‌కు అడ్డుగా ఉందని..

నారాయణపూర్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 234, 233లో కొంత మంది వ్యాపారులు 18 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిలో ఒక వైపు పరిగి నుంచి దోమ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి నారాయణపూర్ గ్రామానికి వెళ్లేందుకు పంచాయతీరాజ్ శాఖ మెటల్ రోడ్డు ఉంది. 30 సంవత్సరాల క్రితం ఈ రోడ్డును వేశారు. తరువాత జిల్లా పరిషత్, ప్రధానమంత్రి సడక్ యోజన కింద మూడు సార్లు మెటల్ రోడ్డును వేశారు. 18 ఎకరాల్లో ఉన్న భూమికి రోడ్డు అడ్డుగా ఉండడంతో రియల్టర్లు తొలగించారు. ఇదే అంశంపై ఈనెల 24న 'సాక్షిలో' 'రోడ్డును తవ్వేశారు' అనే శీర్షికతో కథనం ప్రచురితం అయింది. దీనికి కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించారు. వెంటనే నివేదిక అందించాలని అధికారులను ఆదేశించడం.. అధికారులు నివేదికను పంపించడం జరిగింది. కానీ.. రోడ్డును తవ్విన వారిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు!

కలెక్టర్‌కు నివేదించాం

రియల్టర్లు రోడ్డు తవ్విన విషయం వాస్తవమే. ఘటనా స్థలాన్ని పంచాయతీరాజ్, ఎంపీడీఓ రెవెన్యూ సిబ్బందితో సందర్శించాం. కలెక్టర్ నారాయణరెడ్డికి నివేదిక ఇచ్చాం. పంచాయతీరాజ్ రోడ్డును తవ్వినవారిపై క్రిమినల్ కేసులు పెట్టాల్సి ఉంది. ఎలాంటి అనుమతులు లేకుండా లే అవుట్ పనులను ప్రారంభించినందుకు వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

– రాంబాబు, తహసీల్దార్, పరిగి

సమయపాలన పాటించని మేనేజర్!

మధ్యాహ్నం 2గంటలకే కుర్చీ ఖాళీ


మధ్యాహ్నం 2.14 గంటలకే ఖాళీగా దర్శనమిస్తున్న మేనేజర్ కుర్చీ

ధారూరు: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ విధి నిర్వహణలో సమయపాలన పాటించడం లేదని ఖాతాదారులు ఆరోపించారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు వచ్చిన మేనేజర్ మధ్యాహ్నం 2 గంటలకే వెళ్లిపోయారని తెలిపారు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులను మేనేజర్ పట్టించుకోవడం లేదని, మధ్యాహ్నం తర్వాత ఎప్పుడు వచ్చినా ఉండరని, సిబ్బందిని అడిగితే మీటింగు కోసం వికారాబాద్ బ్యాంకుకు వెళ్లారనే సమాధానం ఇస్తున్నారని ఖాతాదారులు చెప్పారు. అంతే కాకుండా బ్యాంకులో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, ఏదైనా సంఘటన జరిగితే ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. సమయ పాలన, ఖాతాదారులను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వచ్చి వెళ్తున్న మేనేజర్‌పై సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

మధ్యాహ్నం వెళ్లిపోవచ్చు

తరచూ ఫీల్డ్ విజిట్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అలాగే రుణాలు తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లించకుంటే వారి ఇళ్లకు వెళ్లి రికవరీ చేయాల్సి ఉంటుంది. ఇందులో సమయమంటూ ఏమీ ఉండదు. ఒక్కోసారి ఉదయం 7 గంటలకే వెళ్లాల్సి రావచ్చు. మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి వెళ్లిపోయే వెసులుబాటు ఉంది. సీసీల మరమ్మతు కోసం 2 నెలల క్రితమే పై అధికారులకు ఫిర్యాదు చేశాం.

– ఫర్వీన్ ఫాతిమా, మేనేజర్

ప్రైవేటు పనులకు.. జీపీ ట్రాక్టర్

ప్రభుత్వ వాహనంతో వ్యాపారం చేస్తున్న సర్పంచ్ భర్త!


కమీషన్ ఏజెంట్ ఇంటి వద్ద జీపీ ట్రాక్టర్‌లోంచి అన్‌లోడ్ చేస్తున్న మొక్కజొన్న సంచులు

ధారూరు: గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను సర్పంచ్ భర్త సొంత పనులతో పాటు వ్యాపారానికి వినియోగించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ట్రాక్టర్‌లో మొక్కజొన్న సంచులను నింపి ఓ కమీషన్ ఏజెంట్ ఇంటి వద్ద అన్‌లోడ్ చేయడం.. హరిదాస్‌పల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. ఇళ్లలోని చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులో వేయడం, నాటిన మొక్కలకు నీరందించడం తదితర గ్రామ పంచాయతీ విధులకు వినియోగించాల్సిన వాహనాన్ని సర్పంచు భర్త.. ప్రైవేటు పనులకు వినియోగించడమే కాకుండా.. ట్రాక్టర్ ట్రాలీపై ఊరు పేరు తొలగించి తిప్పడం గమనార్హం.

చర్యలు తప్పవు

గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను ప్రైవేటు పనులకు ఏ సర్పంచ్ వినియోగించినా ఉపేక్షించేది లేదు. సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు మెమోలు ఎంపీఓ ద్వారా జారీచేస్తాం. ఎంపీఓను హరిదాస్‌పల్లి గ్రామానికి పంపి విచారణ జరిపిస్తాం.

– చంద్రశేఖర్, ఎంపీడీఓ

విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- శృతిలయ కల్చరల్ అకాడమీ వేసవి శిక్షణ ముగింపు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఆమనగల్లు: విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే ఉన్నతంగా రాణిస్తారని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం ఆలయంలో శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నెలరోజులుగా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరంలో విద్యార్థులకు నృత్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సోమవారం ఈ శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని పట్టణంలోని బీఎన్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కడ్తాల్ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌ఆచర్జి అర్జున్‌రెడ్డి, మాడ్గుల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవితేజ, శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు దార్ల చిత్తరంజన్‌దాస్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు శేఖర్‌గౌడ్, కృష్ణనాయక్, కౌన్సిలర్ శ్రీకాంత్ సింగ్, వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌టేక్ చేయబోయి..

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరు యువకుల మృతి


చంద్రశేఖర్ మృతదేహం


నరేశ్ మృతదేహం


ప్రమాదంలో ధ్వంసమైన బైక్

చేవెళ్ల: ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోతుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరగిద్ద బస్టాప్ సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దౌల్తాబాద్‌లో జాతర ముగించుకొని పల్సర్ బైక్ వస్తున్న ఇద్దరు యువకులు చేవెళ్ల మండలం దామరగిద్ద బస్టాండ్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా చేవెళ్ల వైపు నుంచి వస్తున్న తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన కోస్గి చంద్రశేఖర్ (23), వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామానికి చెందిన ఎన్. నరేశ్(17) అక్కడికక్కడే మృతి చెందారు. వీరివురు దూరపు బంధువులు. చంద్రశేఖర్ శంషాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా.. నరేశ్ శంషాబాద్‌కు సమీపంలో ఇంటర్ చదువుతున్నాడు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

శంకర్‌పల్లి: ఇంట్లో చెప్పకుండా వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రంలోని సాయి నగర్ కాలనీకి చెందిన పి.నర్సింలు(33) రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య మంజుల సోమవారం శంకర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణ తెలిపారు.

కోనేరులో గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత


వెలికితీసిన సంజయ్ మృతదేహం

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి శివరామాలయం ఆవరణలో గల కోనేరులో పడిన వ్యక్తి మృతదేహం సోమవారం సాయంత్రం వెలికి తీశారు. హైదరాబాద్ నగరంలోని శాలిబండ ప్రాంతానికి చెందిన సంజయ్ (38) పెళ్లి రోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్నాడు. అంతకుముందు స్నానం చేసేందుకు కోనేటిలోకి దూకగా, ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు.

ఈశ్వరమ్మకు 'వండర్ ఉమెన్'


అవార్డు అందుకుంటున్న ఈశ్వరమ్మ

ఆమనగల్లు: కళ, సాహిత్యం, విద్యారంగాల ఉన్నతికి కృషి చేసిన మహిళలకు హైదరాబాద్‌లోని ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో వండర్ ఉమెన్–2023 అవార్డులు అందించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన దాస ఈశ్వరమ్మ సాహిత్య రంగంలో చేసిన కృషికి వండర్ ఉమెన్ అవార్డు వరించింది. శనివారం రాత్రి నగరంలోని తెలంగాణ సారస్వత భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెకు సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రముఖ న్యాయవాది డాక్టర్ కనకదుర్గ ఈ అవార్డును అందించారు.

సీడ్స్ పరిశ్రమలో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రామయ్య, సిబ్బంది

కొత్తూరు: నందిగామ పంచాయతీ శివారులో ఉన్న నూజివీడు పరిశ్రమలో స్థానిక పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశ్రమలలో తనిఖీలు నిర్వహించినట్లు సీఐ రామయ్య వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనిఖీల్లో భాగంగా పరిశ్రమలో నిల్వ ఉన్న విత్తనాలు, వాటి వివరాలను పరిశీలించామన్నారు. విత్తనాల నిల్వలు, స్టాకు రికార్డులు సక్రమంగానే ఉన్నాయన్నారు.

హెల్త్ డైరెక్టర్‌కు ఘన సన్మానం


శ్రీనివాసరావును సన్మానించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాస్ మీడియా అసోసియేషన్ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు ఐదేళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ మాస్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాస్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జోనల్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారుడు నరహరి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించని పర్యటనలు ఎందుకు?


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ నియోజకవర్గ నేత వసంతం

చేవెళ్ల: సమస్యలు పరిష్కరించని 'శుభోదయం' ఎందుకు అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు సున్నపు వసంతం ఎమ్మెల్యే కాలె యాదయ్యను విమర్శించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములతో కలిసి విలేకరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతం మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకే ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు గ్రామాల్లోని సమస్యలు ఏకరువు పెడుతున్నా ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాకే గ్రామాల్లో పర్యటించాలన్నారు. ప్రజలు రెండు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చినా ఆయన నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. డిగ్రీ కళాశాల భవనం నిర్మాణం ఎందుకు పూర్తి చేయడం లేదన్నారు. టీటీడీ కల్యాణ మండపం మంజూరైందని ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించుకుని పత్రికల్లో ఫొటోలు వేయించుకున్నారే తప్ప చేసిందేమీ లేదన్నారు. బస్ డిపో ఏర్పాటు చేయడంలోనూ విఫలమయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో గుండాల పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ బాలయ్య, నాయకులు దేవేందర్, శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

షాద్‌నగర్‌రూరల్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాలు అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ మేరీ లైఫ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అండాలు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆకు కూరలు, చిరుధాన్యాలు, జొన్నరొట్టె, సామలు, కొర్రలు, రాగులు, సజ్జలు, బియ్యం, గుడ్లు, పాలు, పప్పులు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పాలు, పండ్లు, గుడ్లు, పప్పులు ఉచితంగా పంపిణీ చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, వార్డు సభ్యులు విజయలక్ష్మి, పావని, అనిత, విజయలక్ష్మి, నర్సింలు, శ్రీపతిరెడ్డి, అంగన్‌వాడీ నిర్మల, జంగమ్మ, చంద్రకళ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. అనంతలోకాలకు

- ఆవును తప్పించబోయి అదుపుతప్పిన బైక్
- ఉపాధ్యాయురాలి మృతి


రోజలత మృతదేహం

మొయినాబాద్: దైవ దర్శనానికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరంలోని బోరబండ ప్రాంతానికి చెందిన డి.రోజలత(47) ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తోంది. సోమవారం మధ్యాహ్నం ఆమె తన కొడుకు భరత్‌తో కలిసి బైక్‌పై చిలుకూరు బాలాజీ దర్శనానికి వెళ్తున్నారు. మధ్యాహ్నం 1.15 గంటల ప్రాంతంలో హిమాయత్‌నగర్ సమీపంలోని పిస్తాహౌస్ హోటల్ వద్ద ఓ ఆవు అడ్డు వచ్చింది. ఆ ఆవును తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి తల్లీ కొడుకులు కిందపడ్డారు. భరత్‌కు స్వల్పగాయాలవ్వగా తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వారిని స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

'మేధా సంపూర్ణ శిక్ష'కు 'ఆదర్శ' విద్యార్థిని


సాయిసుధ

చేవెళ్ల: మేధా ఛారిటబుల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌నకు చేవెళ్ల ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.సాయిసుధ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో మేధా సంపూర్ణ శిక్ష స్కాలర్‌షిప్‌లను అందజేస్తోందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో ఆదర్శ పాఠశాలకు చెందిన సాయిసుధ ఎంపికైందన్నారు. ట్రస్ట్ ఈ స్కాలర్‌షిప్‌లకు ప్రతీ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా వంద మంది విద్యార్థులను ఎంపిక చేస్తోందన్నారు.

భారత రాజ్యాంగం పుస్తకాలు పంచండి

డీఎస్‌పీ ప్రచార కమిటీ నాయకుడు యాదయ్య మహారాజ్

షాబాద్: ప్రతీ పౌరుడు భారత రాజ్యాంగ పుస్తకం కలిగి ఉండాలని డీఎస్‌పీ ప్రచార కమిటీ నాయకుడు యాదయ్య మహారాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ సైదులు గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ పౌరుడికి రాజ్యాంగ పుస్తకం అందించేందుకు చర్యలు తీసుకోవాలని వినతులిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీ నాయకులు నరేశ్, మల్లేశ్, రాఘవేందర్, శివ, బాలు, నవీన్, సురేందర్, దయాకర్, మహేందర్, నర్సింలు, శ్రీకాంత్, చందు, రవి, బలరాం తదితరులున్నారు.